# భక్తి పారవశ్యంలో మరియమాత జపమాల

## ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు







**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో మే 22 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ శనివారం ఆధ్యాత్మిక వాతావరణంతో రోమన్ క్యాథలిక్ ఫాదర్ జోజి బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన మరియమాత జపమాల కార్యక్రమంలో క్రైస్తవ భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జపమాల ప్రార్థనలతో కాలనీ పరిసరాలు ఆధ్యాత్మిక చైతన్యంతో నిండిపోయాయి. ఈ సందర్భంగా ఫాదర్ జోజి బాబు మాట్లాడుతూ మానవాళి రక్షణ కోసం మరియమాత తన జీవితాన్ని అంకితం చేసిన పవిత్ర తల్లిగా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల ఆరాధన పొందుతున్నారని పేర్కొన్నారు. సమాజంలో ప్రేమ, కరుణ, సేవాభావం పెంపొందించడంలో మరియమాత బోధనలు ఎంతో ప్రేరణనిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మానవత్వాన్ని పెంపొందించుకొని పరస్పర సహకారంతో జీవించాలని సూచించారు. ప్రస్తుత కాలంలో కుటుంబ బంధాలు, మానవీయ విలువలు క్షీణిస్తున్న తరుణంలో ఆధ్యాత్మికత మనిషికి మానసిక ప్రశాంతతను అందిస్తోందని తెలిపారు. యువత మంచి మార్గంలో నడవాలని, సమాజ సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. ప్రపంచ శాంతి, ప్రజల ఆరోగ్యం, సుఖసంతోషాల కోసం ప్రత్యేక ప్రార్థనలు



నిర్వహించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పంతులు కమలాకర్, సంఘ పెద్దలు కొట్టే రాజు, శ్రీనివాస్, సుధాకర్‌తో పాటు మహిళలు, యువకులు, చిన్నారులు సహా పలువురు క్రైస్తవ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రత్యేక ఆశీర్వాదాలు అందజేశారు

# ఓటరు జాబితా సమగ్రతకు రాజకీయ పార్టీలు సహకరించాలి

### అర్హులైన ప్రతి పౌరుడి పేరు నమోదు చేయాలి : జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్

### బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాలు వెంటనే సమర్పించాలని సూచన





**ఖమ్మం,/ మే 22 (జర్నలిస్ట్ వార్త):**
ఓటరు జాబితాను సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించేందుకు రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ పిలుపునిచ్చారు. ప్రత్యేక ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల యంత్రాంగానికి అండగా నిలవాలని కోరారు.

శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించే లక్ష్యంతో ప్రత్యేక ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి సేకరిస్తారని చెప్పారు. ప్రతి ఇంటికి కనీసం మూడు సార్లు బీఎల్వోలు వెళ్లి ప్రక్రియ పూర్తి చేస్తారని వివరించారు. ముసాయిదా ఓటరు జాబితా విడుదల అనంతరం క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించి విచారణల తర్వాత అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని వెల్లడించారు. మరణించిన, వలస వెళ్లిన ఓటర్ల వివరాల విషయంలో రాజకీయ పార్టీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బూత్ లెవల్ ఏజెంట్లను వెంటనే నియమించి వారి జాబితాలను సమర్పించాలని కోరారు. మ్యాపింగ్ పూర్తికాని ఓటర్లు జనన ధ్రువీకరణ, పాస్‌పోర్ట్, విద్యార్హత, కుల ధ్రువీకరణ తదితర 12 రకాల పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

ఫారం-6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, ఫారం-8 ద్వారా సవరణలు చేపడతామని, ఆధార్ నంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికమని స్పష్టం చేశారు. ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఉంటే బీఎల్వోలు, హెల్ప్‌లైన్, ఈసీఐ ఓటర్స్ పోర్టల్ సేవలను వినియోగించుకోవచ్చన్నారు. ఇతర రాష్ట్రాలు లేదా విదేశాల్లో ఉన్న ఓటర్ల తరఫున కుటుంబ సభ్యులు కూడా ఫారాలు సమర్పించవచ్చని తెలిపారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన పలు సందేహాలకు కలెక్టర్ సమగ్ర వివరణ ఇచ్చారు. బీఎల్ఏలను నియమించిన వెంటనే వారికి ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎన్నికల శాఖ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతనాల పెంపులో పారదర్శకత లేదు

### పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదు

### 3 లక్షల స్కీమ్ వర్కర్ల భవితవ్యంపై స్పష్టత కరువు -బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు విమర్శ

**నర్సంపేట, మే 22 ( జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల పెంపులో శాస్త్రీయత, పారదర్శకత లేవని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు విమర్శించారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలను సవరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

కార్మిక సంఘాల డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా, క్యాబినెట్ సబ్ కమిటీ పేరిట వేతనాలు ప్రకటించడం కార్మికులను మోసం చేయడమేనని మండిపడ్డారు. దేశానికి ఆదర్శంగా ఉండేలా శాస్త్రీయ పద్ధతిలో కనీస వేతనాలు నిర్ణయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ ఆచరణలో మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కొత్త వేతనాల ప్రకారం అన్ స్కిల్డ్ వర్కర్లకు రూ.16,000, సెమీ స్కిల్డ్ వర్కర్లకు రూ.17,000, స్కిల్డ్ వర్కర్లకు రూ.18,500, హై స్కిల్డ్ వర్కర్లకు రూ.20,000గా నిర్ణయించినప్పటికీ.. ఇప్పటికే జీవో-11 ప్రకారం కార్మికులు రూ.13,098 నుంచి రూ.23,683



వరకు వేతనాలు పొందుతున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వం చెప్పిన పెంపు వాస్తవానికి పెద్దగా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. జీవో-4 ప్రకారం స్కిల్డ్ కార్మికునికి రూ.19,572 ఉండగా.. ఇప్పుడు సీఎం ప్రకటించిన వేతనం రూ.18,500 మాత్రమేనని, అంటే గతంతో పోలిస్తే రూ.1,072 తగ్గిందని పేర్కొన్నారు. కరువు భత్యంపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం మరింత దారుణమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కనీస వేతన సలహా మండలి అన్ స్కిల్డ్ కార్మికుడికి రూ.18,009 కనీస వేతనం, ప్రతి పాయింట్‌కు రూ.12 కరువు భత్యం సిఫార్సు చేసిందని తెలిపారు. 2021లో జారీ చేసిన ఐదు జీవోలకు ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం గెజిట్ విడుదల చేయలేదని విమర్శించారు.

1948 కనీస వేతనాల చట్టం, డాక్టర్ అక్రాయి ఫార్ములా ప్రకారం లెక్కిస్తే నెలకు కనీసం రూ.32 వేల వేతనం రావాల్సి ఉంటుందని, దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు కనీసం రూ.26 వేలైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో అంగన్వాడీ, ఆశా, ఎన్ఆర్ఈజీఎస్, ఎన్ఆర్‌హెచ్ఎం, సర్వ శిక్ష అభియాన్ తదితర పథకాల కింద 3 లక్షలకు పైగా స్కీమ్ వర్కర్లు పనిచేస్తున్నారని, వీరిని ఏ కేటగిరీలోకి తీసుకుంటారో స్పష్టత ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే వేతన సవరణను పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.

# మహిళపై దాడి..

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు

### ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు

### న్యాయం చేయాలంటూ వేడుకోలు

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో మే 22 (జర్నలిస్ట్ వార్త):** మహిళపై దాడి చేసి దుర్భాషలాడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరుతూ ఓ మహిళ ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం ప్రకారం.. మండల పరిధిలోని ముప్పారం గ్రామానికి చెందిన ఆమె కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తుండగా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గత కొంతకాలంగా వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించింది. ఈ నెల 18న జరిగిన ఘర్షణలో తనపై దాడి చేసి కులం పేరుతో దూషించారని ఫిర్యాదులో పేర్కొంది. అడ్డుకునేందుకు వచ్చిన కుటుంబ సభ్యులపై కూడా దురుసుగా ప్రవర్తించారని తెలిపింది. ఈ ఘటనపై వెంటనే స్పందించి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరింది. ఇదిలా ఉండగా, ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

# ఏడాది విజయవంతం.

### . రెండో సంవత్సరంలోకి శ్రీ లక్ష్మీ గణపతి రియల్ ఎస్టేట్

### కస్టమర్ల ఆదరణతో అభివృద్ధి పథంలో సంస్థ

### ప్రతి రైతు సుఖసంతోషాలతో ఉండాలి : నిర్వాహకులు



**తల్లాడ, మే 22 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడలోని శ్రీ లక్ష్మీ గణపతి రియల్ ఎస్టేట్ కార్యాలయం రియల్ ఎస్టేట్ రంగంలో విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుని రెండో సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు కస్టమర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పొన్నం కృష్ణయ్య, బోనాసి శ్రీనివాసరావు, ఎస్కే జాన్ మియా మాట్లాడుతూ.. గత ఏడాది కాలంగా తమ సంస్థకు అండగా నిలిచి ఆదరాభిమానాలు చూపిన ప్రతి ఒక్క కస్టమర్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కస్టమర్ల విశ్వాసం, ఆశీస్సులతోనే సంస్థ అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. రెండో సంవత్సరంలో కూడా మరింత విశ్వసనీయ సేవలతో ముందుకు సాగుతామని, రైతులు ఆయురారోగ్యాలతో పాడిపంటలు పుష్కలంగా పండించుకుని సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సంస్థ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్క కస్టమర్ సోదరులకు పేరుపేరునా మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తుల దాహార్తి తీర్చిన దాతృత్వం

### సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి నూతన బోరు మోటర్ విరాళం

### భక్తుల ప్రశంసలు అందుకున్న బోల్ల వెంకటి దంపతులు

**వైరా, /మే 22 (జర్నలిస్ట్ వార్త):**
వైరా మండలంలోని పుణ్యపురం గ్రామంలో కొలువై ఉన్న పురాతన చరిత్ర కలిగిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల త్రాగునీటి సమస్యకు స్థానిక దాత ముందుకొచ్చారు. గ్రామానికి చెందిన రైతు బోల్ల వెంకటి, అంజలి దంపతులు తమ దాతృత్వాన్ని చాటుతూ ఆలయంలో చెడిపోయిన బోరు మోటర్ స్థానంలో నూతన బోరు మోటార్‌తో పాటు అవసరమైన పరికరాలను ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులకు అందజేశారు. ప్రత్యేకత ఏమిటంటే.. ఎలక్ట్రికల్ పనిలో అనుభవం ఉన్న దాత బోల్ల వెంకటి స్వయంగా బోరు మోటార్‌ను అమర్చి భక్తులకు త్రాగునీటి సౌకర్యం కల్పించారు. దీంతో కొంతకాలంగా ఎదురవుతున్న నీటి ఇబ్బందులు తొలగిపోయాయని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. దాతృత్వంతో ముందుకొచ్చిన వెంకటి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం అర్చకులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి దాత కుటుంబం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు.



# భర్త అనారోగ్యంతో మనస్తాపం..

## మహిళ ఆత్మహత్య

**భీమదేవరపల్లి**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదం నింపింది. ముత్తారం గ్రామానికి చెందిన వడ్డేపల్లి లక్ష్మి (55) కొన్ని రోజులుగా తన భర్త వడ్డేపల్లి శాంతయ్యతో కలిసి మాదాపూర్ లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. తన భర్త ఆరోగ్యం బాగా లేకపోవడంతో పలుచోట్ల ఆస్పత్రుల్లో చికిత్స చేయించినప్పటికీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో లక్ష్మి తీవ్ర మనోవేదనకు గురైనట్లు సమాచారం. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన ముత్తారంకు వచ్చిన ఆమె, శుక్రవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త వడ్డేపల్లి శాంతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్ఐ రాజు తెలిపారు.



# ఎండల ఎఫెక్ట్..

## ఉపాధి కూలీలకు ముందస్తు హెచ్చరిక

### ఉదయం 10 గంటలకల్లా పనులు ముగించాలి : ఎంపీడీవో

### కూలీలకు మజ్జిగ పంపిణీ చేసిన వార్డు సభ్యురాలు మమత





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, మే 22 (జర్నలిస్ట్ వార్త):** భానుడు భగ్గుమంటున్న వేళ ఉపాధి హామీ కూలీల ఆరోగ్య రక్షణపై అధికారులు దృష్టి సారించారు. ధర్మసాగర్ మండలంలో శుక్రవారం ఉపాధి హామీ పనులను గౌరవ ఎంపీడీవో గారు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉదయం 6 గంటలకే పనులకు హాజరై, 10 గంటలలోపు పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్లాలని సూచించారు. వేడిగాలుల ప్రభావం అధికంగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ఈ సందర్భంగా కూలీలకు తాగునీరు, నీడ వంటి మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. మరోవైపు గౌరవ వార్డు సభ్యురాలు మలికిరెడ్డి మమత గారు కూలీలకు మజ్జిగ పంపిణీ చేసి అభినందనలు అందుకున్నారు. మండుటెండల్లో ఉపశమనం కలిగించే ఈ కార్యక్రమాన్ని కూలీలు స్వాగతించారు. ఈ కార్యక్రమంలో గౌరవ ఎంపీడీవో అనిల్ , గ్రామ సెక్రటరీ ప్రవీణ్, సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏరియా, ఉప సర్పంచ్ గ్రామ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్‌లో తప్పులకు తావులేదు

### దేవునూరు, సోమదేవరపల్లిలో అధికారుల ఆకస్మిక తనిఖీలు



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, మే 22 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హౌస్ లిస్టింగ్ సెన్సస్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులు స్పష్టం చేశారు. ధర్మసాగర్ మండలంలోని దేవునూరు, సోమదేవరపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న సెన్సస్ నమోదు ప్రక్రియను శనివారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ఎన్యుమరేటర్ల పనితీరును పరిశీలించారు. ఇళ్ల వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం నమోదు సమయంలో చిన్నపాటి పొరపాటు కూడా భవిష్యత్తులో తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని అధికారులు హెచ్చరించారు. డేటా ఎంట్రీలో అక్షర దోషాలు, సాంకేతిక లోపాలు, వివరాల తారుమారుకు అవకాశం లేకుండా అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. సెన్సస్ ప్రక్రియ దేశ అభివృద్ధి ప్రణాళికలకు కీలకమని పేర్కొంటూ, ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు. గడువులోగా 100 శాతం ఖచ్చితత్వంతో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో మండల సెన్సస్ ఛార్జ్ ఆఫీసర్, తహసీల్దార్ జి. సదానందం, అడిషనల్ ఛార్జ్ ఆఫీసర్, ఎంపీడీవో కె. అనిల్ కుమార్, సెన్సస్ సూపర్‌వైజర్ రవి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

# పంట వ్యర్థాలను కాల్చొద్దు

### :పోలీస్,వ్యవసాయ శాఖ



**బయ్యారం/,మే 22(జర్నలిస్ట్ వార్త)** మండల వ్యాప్తంగా పంట కోతల తర్వాత మిగిలే మొక్కజొన్న సోప్పు, వరి గడ్డి వ్యర్థాలను పొలాల్లో కాల్చడం వల్ల తీవ్ర నష్టాలు జరుగుతాయాని మండల పోలీస్,వ్యవసాయ శాఖ వారు తెలియజేస్తున్నారు. పంట వ్యర్థాలు కాల్చడం వల్ల భూసారం దెబ్బతినడమే కాక, భారీగా వచ్చే పొగ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని,ఈ నేపథ్యంలో వీటిని కాల్చవద్దని, చట్టపరమైన చర్యలు తప్పవని పోలీస్,వ్యవసాయ శాఖలు హెచ్చరిస్తున్నాయి. పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల మట్టిలోని నత్రజని, ఫాస్పరస్,పొటాష్ వంటి ముఖ్యమైన పోషకాలు,సూక్ష్మజీవులు పూర్తిగా నశించిపోతాయని,పొలాల నుండి వచ్చే దట్టమైన పొగ వల్ల రోడ్డుపై వాహనదారులకు కనిపించక ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతాయాని అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి నిప్పు పెట్టడం చట్టరీత్యా నేరం. వ్యర్థాలకు నిప్పు పెట్టడం వల్ల గాలి కలుషితమై ప్రజారోగ్యానికి తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందని,వ్యర్థాలను కాల్చేయడానికి బదులుగా రోటవేటర్, ఇతర పరికరాల సహాయంతో వాటిని భూమిలోనే కలియదున్నాలని,దీనివల్ల భూమికి సహజ సేంద్రియ ఎరువు లభిస్తుంది. బయో-డికంపోజర్లు: వ్యవసాయ అధికారులు సూచించే సూక్ష్మజీవుల ద్రావణాలను (డీకంపోజర్లు) వాడటం ద్వారా గడ్డి త్వరగా కుళ్లిపోయి మంచి ఎరువుగా మారుతుంది. పంట అవశేషాల నిర్వహణపై మరింత సమాచారం కోసం మండల వ్యవసాయ అధికారిని, స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు.

# డిమాండ్ల సాధనకై ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మె

### వైరాతల్లాడ మండలాల్లో జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన

### వేతన పెంపు, పదోన్నతులు, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్





**తల్లాడ/, మే 22 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర ఐకేపీ వీఓఏ సంయుక్త రాష్ట్ర కమిటీ జేఏసీ పిలుపుమేరకు వైరాతల్లాడ మండలాల్లో వీఓఏలు శాంతియుత నిరవధిక సమ్మెకు దిగారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సమ్మెలో పలువురు వీఓఏలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెర్ప్ తల్లాడ మండల శాఖ నిర్వాహకులు మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీఓఏల కనీస వేతనాన్ని రూ.20 వేలుకు పెంచాలని, సెర్ప్ ఉద్యోగులుగా పరిగణిస్తూ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అర్హులైన వీఓఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలని, సామాజిక ఆరోగ్య బీమా, ట్యాబ్ సౌకర్యాలు అందించాలని కోరారు. జీవో నెంబర్ 58ను సవరించి తమ హక్కులను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, శైలజ, ప్రభావతి, నిర్మల, మమత, తేజ, సంజు, రమాదేవి, రాధామణి, వరలక్ష్మి, మల్లీశ్వరి, విజయలక్ష్మి, స్రవంతి, గద్దె నీరజ తదితరులు పాల్గొన్నారు.

# గొల్లగూడెంలో మట్టి మాఫియా దందా..!

**ప్రభుత్వ అనుమతుల్లేకుండానే ఏరు మట్టి అమ్మకాలు?**

**ప్రశ్నించిన విలేకరులపై బడాబాబు దురుసు**

**"మా వద్ద ఎలాంటి పర్మిషన్ లేదు" అంటున్న జీపీఓ, సెక్రటరీ**



**తల్లాడ/, మే 22 (జర్నలిస్టు వార్త):**
తల్లాడ మండలంలోని గొల్లగూడెం గ్రామపంచాయతీలో మట్టి మాఫియా రెచ్చిపోతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఏరు మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ గ్రామంలో యథేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం మౌనం వీడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

గ్రామానికి చెందిన ఓ బడాబాబు తన పొలం పక్కనే ఉన్న ఏరు మట్టిని ట్రిప్పు రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా జరుగుతున్న ఈ మట్టి దందాపై విలేకరులు ప్రశ్నించగా.. "మీకు ఇష్టం వచ్చినట్లు రాసుకోండి.. ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం. అనుమతులు తీసుకున్నారా..? ప్రభుత్వ అధికారుల నుంచి పర్మిషన్ ఉందా..? అని అడిగినా సరైన సమాధానం ఇవ్వకుండా తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. ఈ వ్యవహారంపై జీపీఓ, గ్రామ సెక్రటరీని వివరణ కోరగా.. "మా వద్ద ఎలాంటి అనుమతులు తీసుకోలేదు" అని స్పష్టం చేసినట్లు సమాచారం. గ్రామంలో జరుగుతున్న అక్రమ మట్టి తరలింపులపై అధికారులకు సమాచారం లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గ్రామంలో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువైందని, కొందరి అండదండలతోనే మట్టి మాఫియా బహిరంగంగా దందా సాగిస్తోందని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి అక్రమ మట్టి రవాణాపై దృష్టి సారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# భాగ్యరెడ్డి వర్మ సమాజానికి ఆదర్శం

### కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి






**వరంగల్/ మే 22(జర్నలిస్ట్ వార్త);**
భాగ్యరెడ్డి వర్మ సమాజానికి చేసిన సేవలు అనన్యసామాన్యమని, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ఆయన నిరంతరం పోరాడారని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి కొనియాడారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో భాగ్యరెడ్డి వర్మ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భాగ్యరెడ్డి వర్మ హైదరాబాద్ నగరంలో మహిళల కోసం, అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. అనంతరం దళిత రత్న అవార్డు గ్రహీత, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు బిర్రు మహేందర్ మాదిగ మాట్లాడుతూ జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకున్న భాగ్యరెడ్డి వర్మ,



చదువు ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నమ్మారని తెలిపారు. అందుకోసమే హైదరాబాద్‌లో మహిళలు, వెనుకబడిన వర్గాల కొరకు ప్రత్యేకంగా 33 పాఠశాలలను ఏర్పాటు చేశారని వివరించారు. రెడ్డి అంటే పాలకులు, వర్మ అంటే నిర్దేశించేవారని.. తాను కూడా పాలకుడిగా మారి సమాజాన్ని నడిపించాలనే సంకల్పంతోనే ఆయన ఆ పేరు పెట్టుకున్నారని మహేందర్ పేర్కొన్నారు. ఇంతటి మహోన్నత నాయకుడి జన్మదిన వేడుకలను భవిష్యత్తులో మరింత అంగరంగ వైభవంగా ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు.

మాల మహానాడు జాతీయ నాయకులు మన్నె బాబురావు మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ సమాజానికి ఆదర్శవంతమైన సంఘసంస్కర్త, దళిత మహాజన నాయకుడని కొనియాడారు. టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కేదాసి మోహన్ మాదిగ మాట్లాడుతూ.. ఆయన భావితరాలకు ఆదర్శవంతమైన బలమైన దళిత ఉద్యమ కెరటమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, జెడ్పీ సీఈఓ, అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు మిద్దెపాక ఎల్లయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సంఘీ ఎలేందర్, స్వచ్ఛంద సేవ కోఆర్డినేటర్ రాజేందర్, సోషల్ వెల్ఫేర్ డీడీ, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

